# గ్రామ అధ్యక్షుల సమ్మేళనానికి పెద్ద ఎత్తున తరలిరావాలి

**-రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్ రూరల్, జూలై 2, ప్రభాతవార్త:**

ఈనెల 4వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో జరిగే గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మే ళనానికి హుస్నాబాద్ నియోజకవర్గం నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం విడుదలచేసిన ప్రకట నలో నిర్వహించబోయే ఈసభకు ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గేతోపాటు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ ముఖ్యనేతలు హాజరవుతున్నారని ఈ సభను విజయవంతం చేసేందుకు గ్రామశాఖ అధ్యక్షులు, మండలకమిటీ అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లాకమిటీల నేతలు, అను బంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం

**-ప్రకటన విడుదల చేసిన పరిశ్రమ సెక్రటరీ వివేక్‌కుమార్**

**పటాన్‌చెరు, జూలై 2, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం ప్రమాదంపై బుధవారం సిగాచీ పరిశ్రమ ప్రకటన విడుదలచేసింది. సిగాచీపరిశ్రమలో జరిగిన ప్రమాదం విషయంలో మరణించిన కుటుంబాలకు కోటి రూపాయలు ఇవ్వడానికి యజమాన్యం అంగీకరించింది. పేలుడు కారణంగా 40మంది మృతి చెందినట్లు, మరో 33మంది గాయపడినట్లు తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించింది. గాయపడినవారికి పూర్తివైద్యం అందిస్తామని తెలిపారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సిగాచీ తరపున కంపెనీ సెక్రటరీ వివేక్‌కుమార్ ఈమేరకు ప్రకటన విడుదలచేశారు. ప్రమాదంపై స్టాక్ మార్కెట్లకు ఆయన లేఖ రాశారు. ఈఘటనకు రియాక్టర్ పేలుడు కారణం కాదని తెలిపారు. ప్రభుత్వ విచారణ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. 3నెలల వరకు ప్లాంట్‌లో కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు వివేక్‌కుమార్ పేర్కొన్నారు.

# రోడ్డుపై గుంతలు పూడ్పించిన మంత్రి

**-మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు**



రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న దృశ్యం

**అక్కన్నపేట, జూలై 2, ప్రభాతవార్త:**

మండలంలోని గౌరవెల్లి గ్రామంలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలతో ప్రజలు, వాహనదారు లు ఇబ్బందులు పడుతున్నారనే విషయం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పొంద్రాల దాము ద్వారా తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించారు. బుధవారం ఉదయమే ధరణి కాంట్రాక్టర్‌తో మాట్లాడి గుంతలు పూడ్పించడంతో మంత్రికి గ్రామ స్థులతోపాటు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దాము మాట్లా డుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో గ్రామానికి నూతన రహదారి రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్య క్రమంలో పార్టీ నాయకులు కనకయ్య, నిర్మలతో పాటు తదితరులు ఉన్నారు.

# ఆషాఢ ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న రాజు

**మర్కుక్, జులై 2, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని పాండురంగ ఆశ్రమంలో ప్రారంభమైన ఆషాఢ ఉత్స వాలకురావాలనికోరుతూ సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి ఆహ్వానపత్రికను ఆశ్రమ నిర్వాహకులు రాజు బుధవారం అందజేశారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ ఆషాఢ ఉత్స వాల్లో తప్పకుండా పాల్గొంటానని కలెక్టర్ హైమావతి తెలిపినట్లు పేర్కొన్నారు.

# నిరుపేదల కలలను నేరవేర్చే పథకం ఇందిరమ్మ ఇళ్లు

**-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

**హవేలీఘనపూర్, జూలై 2, ప్రభాతవార్త:**

నిరుపేద కుటుంబాలకు ఇంటి కలను నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం హవేలీ ఘన్‌పూర్ మండలం లోని రాజపేట్, కొత్తపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లలబ్దిదారుల ఇంటినిర్మాణ పనులను, గ్రామ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్దిదారుడికి పథకాలు పారదర్శకంగా అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. ఇల్లు అన్నది ప్రతి ఒక్కరి జీవితంలో ఒకప్రధానమైన అవసరమని, ఇదికేవలం గృహంకాదు, ప్రతి కుటుంబా నికి ఆత్మగౌరవాన్ని తీసుకొచ్చే ఆశ్రయమన్నారు. లబ్దిదారులు పక్కా ఇళ్లనిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణంలో పారదర్శకత, నాణ్యత కచ్చితంగా పాటించాలన్నారు. ప్రభుత్వ నిధులు నిజంగా అర్హులైన వారికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి లబ్దిదారుడూ తమ హక్కుగా మంజూరైన ఇల్లు నిర్మించుకునేవరకు అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని మురుగునీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని, ప్రజలు పరిసరాలు వ్యక్తిగత శారీరక పరిశుభ్రతపై దృష్టి సారించాలని, ప్రజలు వర్షాకాలం దృష్టిలోపెట్టుకుని కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, దోమల నిర్మూలనకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తద్వారా డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు సోకకుండా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ

**-3.65 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**-ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావ్**



పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**సంగారెడ్డి బ్యూరో, జూలై 2, ప్రభాతవార్త:**

అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనేది తన సంకల్పం అని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధిపరిచేందుకు 30కోట్ల రూపాయలతో మెదక్ చర్చి, అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేశామన్నారు. ఈరోజు మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 3కోట్ల 65లక్షల రూపాయలతో సుభాష్‌నగర్‌కాలనీలో కోటి 40లక్షల రూపాయలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కు శంకుస్థాపన చేశామని, 2కోట్ల 13లక్షల వ్యయంతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చర్చిలో మెయిన్ గేట్ నుండి చర్చి వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. 8లక్షల రూపాయల వ్యయంతో వెంకట్రావునగర్‌కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు.

అనంతరం మున్సిపాలిటీలో శానిటేషన్ వర్కర్లకు శానిటేషన్ పరికరాలు, రెయిన్ కోట్స్, మాస్కులు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్స్, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

**-మండల ప్రత్యేకాధికారి ఎం.సాగర్**

**మర్కుక్, జూలై 2, ప్రభాతవార్త:**

విద్యార్థుల విద్య, ఆరోగ్యం, ఆహారం సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.సాగర్, తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపిడిఓ అశోక్, ఎంఈఓ వెంకటరాములు, మండల వైద్యాధికారి దీప అన్నారు. బుధవారం మండలకేంద్రం మర్కుక్‌లో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంను వారు అకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్నభోజనం, పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్, భౌతిక వసతులు, రికార్డులను పరిశీలించారు. అలాగే పిల్లలతో విద్యాలయంలోని వసతులను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు కస్తూర్బా విద్యాలయంను సందర్శించామని తెలిపారు. తక్షణ అవసరాలు ఆర్ఓ వాటర్, డైనింగ్ హాల్, ఫర్నిచర్, గ్రౌండ్ లెవల్, డ్రైన్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని విద్యాలయ ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి తమ దృష్టికి తెచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల విద్య, ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు.

# ఆయిల్‌పామ్ సాగులో తక్కువ పెట్టుబడి, అధిక లాభం

**-పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం**

**-జిల్లాలో 2,500ఎకరాల్లో సాగు లక్ష్యం**

**-భారీ రాయితీతో డ్రిప్పు పరికరాల అందజేత**

**-రైతువేదికలో సమీక్షాసమావేశం నిర్వహణ**

**-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

**హవేలీఘనపూర్, జులై 2, ప్రభాతవార్త:**

తెలంగాణప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తరణ పైన దృష్టిసారించి దేశంలోనే మనరాష్టం మొదటి స్థానంలో ఉండేలా రైతులను ప్రోత్సహిస్తుందని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు.

హవేలీ ఘనపూర్ రైతువేదికలో ఆయిల్‌పామ్ పంట విస్తరణ పథకం సమీక్షాసమావేశం నిర్వహణ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాకు 2500 ఎకరాల లక్ష్యం కేటా యించగా, ఉద్యాన శాఖలో అధికారుల కొరత ఉన్నందున, 15రోజుల క్రితం ప్రతి ఒక్కరికి 30ఎకరాల చొప్పున లక్ష్యంగా కేటాయించడం జరిగింది. తదనుగునంగా ఇప్పటివరకు గుర్తించిన రైతులు వివరాలను, తదుపరి కార్యాచరణ గురించి సమీక్షించారు. మెదక్ జిల్లాలో 2023 -24 సంవత్సరంలో 78మంది రైతులు 336ఎకరాలలో, 2024,-25 సంవత్స రంలో 152రైతులచే 533ఎకరాల ఆయిల్‌పామ్ సాగు చేపట్టడం జరిగినది. ఈసంవత్సరం అనగా 2025,26 సంవత్సరానికి మెదక్‌జిల్లాకు 2500 ఎకరాలలో ఆయిల్‌పామ్ తోటల సాగు చేయుటకు ప్రణాళిక చేసుకోవడం జరిగినది. ఇప్పటివరకు 1677ఎకరాలకి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగినది. అందులోనుండి 771 ఎకరాలు ఆయిల్ పామ్ తోటలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆయిల్‌పామ్ పంట విస్తరణపథకం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుపరుస్తూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లెవెల్‌లో సమీక్షలు నిర్వహిస్తు న్నందున, మిగిలిన లక్ష్యాలను కూడా త్వరితగతిన వారంరోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించడం జరి గింది. దేశానికేసరిపడా పామ్‌ఆయిల్ ఉత్పత్తి చేసే సామర్థ్యం రైతులకు ఉందని గమనించి ఉద్యాన శాఖ ద్వారా మొక్కలతోపాటు పంట సాగుకు అవసరం అయ్యే డ్రిప్ ఇరిగేషన్ సిస్టంని రాయితీ పైన అందిస్తుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులను మళ్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నంచేస్తూ, ఇందుకోసం అవ సరమైన పెట్టుబడి సాయాన్ని రైతులకు అంద జేస్తోందన్నారు. మొక్కల అందజేత నుంచి ఎరు వులు, డ్రిప్పు పరికరాలు, అంతరపంటలసాగు తదితర వాటికి ప్రభుత్వం ప్రోత్సహకాలు ఇస్తోం దని, ఎస్సి, ఎస్టి రైతులకు వందశాతం, బిసి రైతులకు 90 శాతం, ఇతర వర్గాల రైతులకు 80 శాతంచొప్పున రాయితీసదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. నాటిన 4వ ఏటి నుంచి 30 ఏళ్ల వరకూ రైతులకు ఆయిల్‌పామ్ తోటల ఫలసాయం అందుతుందన్నారు. ఆయిల్‌పామ్ పంట పండించడం ద్వారా రైతు సుస్థిర ఆదాయం నికరంగా ఎకరాకు రూ.1,50,000పొందవచ్చని, చీడపీడల బాధ తక్కువగా ఉంటుందని, కోతుల, ప్రకృతి వైపరీత్యాల, దొంగల బెడద ఉండదు కావున వరి వేసే రైతులు పంట మార్పిడి దిశగా ప్రోత్సహించాలని కోరడం జరిగింది. అంతే కా కుండా కాకుండా ప్రభుత్వం తరుపున రాయితీలు ఎకరాకు రూ.50,918/ చొప్పున అందిస్తున్నది. కావున మెదక్ జిల్లాలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన పెంచుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగుచేపట్టి ఇతరపంటల కంటే అధికదిగుబడి, లాభం పొందవలసిందిగా కోరడం జరుగుచున్నది. ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ, రాష్ట్రీయ ఆఫీస్ నుండి మెదక్ జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించబడిన ఉద్యాన జాయింట్ డైరెక్టర్ సునీత మాట్లాడుతూ మెదక్ జిల్లా ఆయిల్ పామ్ తోటల సాగుకు అనుకూలంగా వుందని ఐఐఓపిఆర్ ఆయిల్‌పామ్ పరిశోధనస్థానం, పెద వేగి శాస్త్రవేత్తలు జిల్లానుసందర్శించి ధృవీకరిం చగా, 2023-24 సంవత్సరం నుండి జిల్లాలో ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహించడం జరిగింది.




రైతువేదికలో సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు నిమిత్తం రైతులకు మొక్కలు సరాఫరా చేయుటకు లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు చెల్మెడ గ్రామం నిజాంపేట్ మండలంలో 40 ఎకరాల స్థలంలో నర్సరీని స్థాపించడం జరిగినది. మీటర్ల దూరంలో త్రికోణ ఆకార పద్ధతి (ట్రైయాంగ్యులర్‌మెథడ్)లో మొక్కలు నాటుకో వడం వలన ఒక్క ఎకరానికి 57మొక్కలు వస్తాయి అని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి ప్రతాప్‌సింగ్, మెదక్ ఉపసంచాలకులు విజయ నిర్మల, నర్సాపూర్ వ్యవ సాయ ఉపసంచాలకులు సంధ్యారాణి, కౌడిపల్లి ఉపసంచాలకులు, లివ్‌పామ్ రిసోర్సెస్ కంపెనీ డైరెక్టర్ రంగ నాయకులు, పామ్ రిసోర్సెస్ కంపెనీ మేనేజర్ కృష్ణ, మండల వ్యవసాయ అధికారి, ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, లివ్ రావు, ప్రతినిధులు, మైక్రో ఇరిగేషన్ ప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వ నిబంధనల మేరకే ఇంటి నిర్మాణాలు చేపట్టాలి

**-ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బాలికల విద్యాలయం పరిశీలించిన అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్**



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

**సిద్దిపేట(తొగుట), ప్రభాతవార్తప్రతినిధి:**

తొగుట మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేట, తొగుట మండల కేంద్రంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ బుధవారం పర్యటించారు. తొగుట మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేటలో 33 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా లబ్దిదారుల ఇల్లు నిర్మించే స్థలాలను అమె పరిశీలించి మాట్లాడారు. ముగ్గు పోయగానే పనులు ప్రారంభించి ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాలు చేపట్టా లన్నారు. ఇంటి నిర్మాణాలను హౌసింగ్ అధికా రులు పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు ఫోటో క్యాప్చర్ చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణంలో నాణ్యత ప్రమా ణాలు పాటించాలన్నారు. అనంతరం వనమహో త్సవంలో భాగంగా మొక్కలు ఫిట్టింగ్ ప్లాంటింగ్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ఆరోగ్య కేంద్రం పరిశీలన...**

తొగుట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీజనల్ వ్యాధులు రాకుండా చాలా అప్రమత్తంగా ఉండాలని సీజనల్ వ్యాధులు రాకుండా కావాల్సిన సామగ్రిని అందు బాటులో ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. సీజనల్ వ్యాధులబారిన పడకుండా ప్రజలకు అవ గాహన కల్పించాలన్నారు.

**బాలికల విద్యాలయం పరిశీలన...**

తొగుట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులతో యూనిఫామ్ పంపిణీ ప్రక్రియ, భోజనం నాణ్యత అడిగి తెలుసుకున్నారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని నాణ్య మైన వంటసామగ్రిని వినియోగించాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించా లన్నారు. విద్యార్థులు సీజనల్ వ్యాధులబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కూర్చొని ప్రార్థన చేసి భోజనంచేశారు.

కార్యక్రమంలో ఆమెవెంట డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి దామోదర్‌రావు, ఎంపిడివో తదితరులు ఉన్నారు.

# ప్రమాద స్థలిని పరిశీలించిన సిగాచీ మాజీ డైరెక్టర్

**-సిగాచీ మాజీ డైరెక్టర్‌తో వాగ్వాదానికి దిగిన బాధిత కుటుంబసభ్యులు**

**-పోలీసుల సహాయంతో పరిశ్రమ పరిశీలన**

**పటాన్‌చెరు, జులై 2, ప్రభాతవార్త:**

సంగారెడ్డిజిల్లా పటాన్‌చెరు సమీపంలోని పాశ మైలారం ఇండస్ట్రియల్ ప్రాంతంలో సిగాచీ పరి శ్రమలో రియాక్టర్‌పేలి 37మంది మృతిచెందారు. ఈవిషాద సంఘటన రాష్ట్ర చరిత్రలోని అతిపెద్ద ఇండస్ట్రియల్ ప్రమాదంగా నిలిచింది. ఈప్రమా దంలో మరో 11మంది ఆచూకీ లభించకపోవ డంతో శిథిలాలకింద చిక్కుకొని ఉంటారని అను మానిస్తున్నారు. అయితే ఈప్రమాదం జరిగిన 48 గంటల తర్వాత సిగాచీసంస్థ యాజమన్యం స్పందించి మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లిస్తామని ప్రక టించింది. అంతకుముందు ఆసంస్థ మాజీ డైరెక్టర్ చిదంబరనాథన్ ప్రమాదస్థలిని పరిశీలించారు. ఈ క్రమంలో బాధితుల కుటుంబ సభ్యులు అతనితో వాగ్వాదానికి దిగారు. తమ కుటుంబాలకు న్యాయం చేయాలని చిదంబర నాథన్‌ను కార్మికుల కుటుంబాలు అడ్డుకున్నాయి. అనంతరం ఆయన పోలీసుల సాయంతో పరిసరాలను పరిశీలించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. అయితే ఓ పక్క కార్మికుల కుటుంబ సభ్యులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటంతో, మీడియా సభ్యులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమా ధానాలు చెప్పారు. నిన్నటి సిఎం పర్యటనలో మేనేజ్‌మెంట్ సభ్యులు ఉన్నారని, పరిశ్రమ ప్రతి నిధులు రాలేదా అని సిఎం ఎందుకు అన్నారో తనకు తెలియదని అన్నారు. ప్రమాదం జరిగి నప్పటి నుంచి జిల్లా కలెక్టర్, ఎస్పి, ఉన్నతా ధికారులతో తాము టచ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. 30ఏళ్లలో ఇలాంటి ప్రమాదం ఎన్నడూ జరగలేదని అన్నారు. ఇప్పుడే ఎందుకు జరిగిందనే దానిపై తమకు ఎటువంటి క్లారిటీ లేదని సిగాచీ మాజీ డైరెక్టర్ చిదంబరనాథన్ విలేకరులతో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సిగాచీ మాజీ డైరెక్టర్ చిదంబరనాథన్

# రాయసముద్రం చెరువు అభివృద్ధికి సహకరించండి

**-టూరిజం డైరెక్టర్‌కు కార్పొరేటర్ వినతి**



వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందచేస్తున్న పుష్పనగేష్

**రామచంద్రాపురం, జులై 2, ప్రభాతవార్త:**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రాయ సముద్రం చెరువును దుర్గం చెరువులా తీర్చిదిద్దాలని కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ బుధవారం తెలంగాణ రాష్ట్ర టూరిజం, కల్చరల్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి (సంగారెడ్డి కలెక్టర్‌గా విధులు నిర్వహించిన)కి వినతి పత్రం అందచేశారు. బుధవారం కార్పొరేటర్ వల్లూరు క్రాంతిని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని యోగక్షేమాలు విచారించి రాయసముద్రం చెరువులో టూరిజంశాఖ ద్వార బోటింగ్, కేబుల్ బ్రిడ్జి, స్టాచ్యూ, బోట్ క్యాంటీన్, వాటర్‌ఫాల్, డ్రోన్ షో తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. కల్చరల్‌శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి తనవినతికి సానుకూలంగా స్పందిం చినట్లు కార్పొరేటర్ పుష్పనగేష్ పేర్కొన్నారు.

# మేకల దొంగల అరెస్ట్



అరెస్టుచేసిన దొంగలవివరాలు తెలుపుతున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

**వర్గల్, జూలై 2, ప్రభాతవార్త:**

మేకలదొంగతనానికిపాల్పడిన ఇద్దరుదొంగలను గతంలో అరెస్ట్‌చేసిరిమాండ్‌కు పంపించగా మరోఇద్దరిని బుధవారం అరెస్ట్‌చేసినట్లు గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం 3నెలలక్రితం మండల పరిధి లోని మల్లారెడ్డిపల్లిగ్రామంలో 4మేకలను దొంగిలించిన నీరజ్‌కుమార్ ఇంచరే (21), మాఖన్‌విశాల్‌సింగ్(22)లను అప్పుడే అరెస్ట్‌చేయగా, మరోఇద్దరు పరార్ అయ్యారని తెలిపారు. బుధవారం వర్గల్‌కమాన్ వద్ద వాహనాలతనిఖీ నిర్వహి స్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా సూర్యవంశీ రాహుల్(22), ధరంకార్ గోపాలకృష్ణ(23)లు గతంలో తొగుట, గౌరారం పోలీస్‌స్టేషన్లపరిధిలో నేరం ఒప్పుకున్నారు. మరోసారి మేకలను దొంగిలించడా నికి మేకల షెడ్‌లను వెతకడానికి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. దీంతో వారిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## గొంగ్లూరు తాండాలో బోగ్ భండార్ దృశ్యం

**పుల్కల్, జులై 2, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గొంగ్లూరు తాండాలో బుధవారం మహా బోగ్ భండార్ పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవం జగదాంబ భవానిమాత, సద్గురు సంత్‌సేవాలాల్ మహారాజ్ 32వ జాతర వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన పూజారులు భవాని మాత ఆలయంలో బోగ్ భండార్ నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తాండలో బోనాలు ఊరేగింపును కనుల పండువగా నిర్వహించారు. ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆలయాల్లో గిరిజనులు వేడుకోవడం కానవచ్చింది. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్, విశ్రాంత వార్డెన్ రమావత్ చంద్రకాంత్, పూజారి పాండునాయక్, గంగ్యానాయక్, లక్ష్మణ్, బీడీఎల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కిషన్‌నాయక్, జైసింగ్, భీంలాల్, తూక్యానాయక్, భీమ్లానాయక్, అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంపౌండ్‌వాల్, మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

**హుస్నాబాద్‌టౌన్, జూలై 2, ప్రభాతవార్త:**
మండలంలోని పోతారం గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కాంపౌండ్ వాల్‌తో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి స్థానిక ఎంఈవో బండారు మనీలతో కలిసి బుధవారం భూమిపూజ నిర్వహించారు. భూమిపూజ నిర్వహించినవారిలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పోతుగంటి బాలయ్య, నియోజకవర్గ స్పోర్ట్స్ ఇంచార్జ్ వెన్నరాజు, మాజీసర్పంచ్ బత్తిని సాయిలు, జగ్గారెడ్డి, రాజ్ కుమార్, తిరుపతిరెడ్డి, సంపత్, రమేష్‌నాయక్, నాగరాజుతోపాటు తదితరులు ఉన్నారు.

## నిరక్షరాస్యుల వివరాలను ఉల్లాస్ యాప్‌లో ఎంట్రీ చేయాలి

**-మండల విద్యాధికారి తారాసింగ్**

**నర్సాపూర్, జూలై 2, ప్రభాతవార్త:**
మండలంలోని నిరక్షరాస్యులను, మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థుల వివరాలను మూడు రోజుల్లో ఉల్లాస్ యాప్‌లో ఎంట్రీ చేయాలని మండల విద్యాధికారి తారాసింగ్ అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి మండల విద్యాధికారి తారాసింగ్, ఐకెపి ఎపిఎం గౌరీశంకర్‌లు హాజరయ్యారు. ఈసందర్బంగా వారుమాట్లాడుతూ మండలంలోని నిరక్షరాస్యులయిన మహిళలకు చదవడం రాయడం వాలంటీర్ల ద్వారా నేర్పించడం, పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ విధానంలో ఉన్నత విద్యకు ప్రోత్సహించడానికే ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి తారాసింగ్, ఐకెపి ఎపిఎం గౌరీశంకర్, ఎంఐఎస్ సుధాకర్‌గౌడ్, డేటా ఆపరేటర్ రూప, సిఆర్‌పిలు బైరవరెడ్డి, రాధాగోపాల్, నరసింహచారి, విశ్వకాంత్, సుజాత, ఐకెపి సీసీలు దేవిసింగ్, ఆంజనేయులు, రవీందర్, ప్రవీణ, భాగ్య, సిఏలు, అకౌంటెంట్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేద్దాం

**-పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ శ్రీనివాస్**

**సిర్గాపూర్, జులై 2, ప్రభాతవార్త:**
పాఠశాలలో విద్యార్థులు హాజరు శాతం, విద్యాప్రమాణాల మెరుగుకు పాటుపడదామని, అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంఈఓ నాగారం శ్రీనివాస్ ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలకేంద్రమైన సిర్గాపూర్‌లో మధ్యాహ్నభోజనం అనంతరం ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో విద్యార్థులు నమోదు, పుస్తకాలు, ఏకరూప దుస్తువుల పంపిణి నమోదు చేయాలన్నారు. ప్రతినిత్యం ఎఫ్ఆర్ఎస్, ఎండిఎం ఎస్ఎంఎస్ విధిగా చేయాలన్నారు. తమ పాఠశాల పరిధిలో బడిఈడు చిన్నారులు, బడిబయట విద్యార్థులు లేరని ప్రధానోపాధ్యాయులు ధృవీకరణ చేయాలని ఎంఈఓ నాగారం శ్రీనివాస్ వివరించారు.

## స్థానికసంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**-రాజ్యాంగ పరిరక్షణ సభను విజయవంతం చేయాలి**

**-పిసిసి ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్**

**గజ్వేల్, జూలై 2, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిసిసి ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో ఎస్ఎం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 4వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్‌బి నగర్‌లో రాజ్యాంగ పరిరక్షణ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆసభకు గజ్వేల్ నియోజకవర్గం నుండి సుమారు 500లకుపైగా నాయకులు, మాజీప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు వంటేరు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ మోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రంగారెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్‌నాయకులు ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, సమీర్, జహీర్, మామిడాల శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, రేగొండ, అజార్ తదితరులు పాల్గొన్నారు.

## తారా కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేష్

**సంగారెడ్డి టౌన్, జూలై 2, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పి రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ప్రిన్సిపాల్‌గా సేవలు అందచేసిన డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్ పదవీ విరమణ పొందడటంతో ఖాళీ అయిన ప్రిన్సిపాల్ స్థానాన్ని జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.రమేష్‌కు అదనపు ఆధ్యతలు అప్పగిస్తే కళాశాలలో ప్రిన్సిపాల స్థానాన్ని భర్తీచేశారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌కు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు.

## బూత్‌స్థాయి అధికారులకు శిక్షణపై వీడియో కాన్ఫరెన్స్‌లో అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల ప్రధాన అధికారి ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డితో పాటు బూత్‌స్థాయి అధికారులు తదితరులు

**నర్సాపూర్, జూలై 2, ప్రభాతవార్త:**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఈ నెల 3 వ తేదీ గురువారం రోజున బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ప్రారంభమవుతుంది ఈమేరక నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్ లో బూత్ స్థాయిఅధికారులకు శిక్షణపై అన్ని వివరాలు తెలియజేశారు. బుదవారం బూత్ స్థాయి అధికారులకు ఆర్టీవో కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ లో వీక్షి ంచారు. ఈసందర్బంగా ఆర్డీవో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ బూత్‌స్థాయి అధికారులకు ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్ లో ఈశిక్షణ వివరాలను వివరించారు. నర్సాపూర్ నియోజకవర్గ అన్ని మండలాల్లోగల బూత్‌స్థాయి అధికారులకు మండలాల కేటాయించిన ఆయా తేదీలలో జాతీయ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు బూత్ స్థాయి అధికారులకు ఈ శిక్షణలో వారు నిర్వర్తించ వలసిన విధులను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వహించాలని బూత్‌స్థాయి అధికారులకు ఆర్డీవో మహిపాల్‌రెడ్డి వివరించారు. ఈకార్యక్రమంలో ఆయా మండలాల బూత్ స్థాయి అధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిగాచి పరిశ్రమలో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

**- సహాయక చర్యల్లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, ఎస్పి పారితోష్ పంకజ్**


సహాయకచర్యలో పాల్గొంటున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పి పారితోష్ పంకజ్


ఘటనాస్థలాన్నిపరిశీలిస్తున్నమీనాక్షినటరాజన్, మంత్రిదామోదర్‌రాజనర్సింహ


క్షతగాత్రులను, వారికుటుంబీకులనుపరామర్శిస్తున్న మీనాక్షినటరాజన్, మంత్రి దామోదర్

**సంగారెడ్డి బ్యూరో జూన్ 2, ప్రభాతవార్త:**
సిగాచి ప్రమాదం జరిగినప్పటి నుండి జిల్లా కలెక్టర్ కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పి పారితోష్ పంకజ్‌లు, ఘటన స్థలంకు చేరుకొని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సహాయక బృందాలకు మార్గదర్శనం చేస్తున్నారు. ఈసందర్భంగా బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఐల కార్యాలయంలో ప్రత్యేక సహాయక కేంద్రం ఏర్పాటు చేసామన్నారు. వారి కుటుంబ సభ్యులకు భోజనం, తాత్కాలిక నివాసం, రవాణా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. బాధిత కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. బాధితులు వారివారి స్వగ్రామాలకువెళ్లేందుకు అవసరమైన రవాణా ఏర్పాట్లు చేసామన్నారు. ఒడిశా, బీహార్ రాష్ట్రాల అధికారులు కూడా సహాయక చర్యలు అందిస్తున్నారు. సిగాచిఫార్మా పరిశ్రమ ప్రమాదంపై తాజా పరిస్థితులను కలెక్టర్ వివరించారు. సిగాచిపరిశ్రమ అధికారికంగా అందిన వివరాల ప్రకారం వివరాలు ఈవిధంగా అందించారు. మొత్తం 143మంది ఉద్యోగులు వివరాలు అందించారు. సురక్షితంగా ఉన్నవారు 60, గాయపడి చికిత్స పొందుతున్న వారు 35, గుర్తించబడిన మృతులసంఖ్య 18, గుర్తించలేని మృతదేహాలు 20, గల్లంతైనవారు 10మంది ఉన్నారు. కుటుంబాలకు అప్పగించిన మృత దేహాలు 18, ప్రయోగశాలలో డిఎన్ఏ ఫలితాల కోసం పెండింగ్‌లో 18 నమూనాలు ఉనాయి. ఇంకా సేకరించాల్సిన మృతదేహాల నమూనాలు 2, పరీక్షించాల్సిన కుటుంబసభ్యుల రక్తనమూనాలు 25, ఇంకా 5కుటుంబాల నుండి సేకరించాల్సి ఉంది. గుర్తించలేని కుటుంబాలసంఖ్య 3, డిఎన్ఏ ద్వారా మ్యాచ్ అయిన నమూనాలు 5, పూర్తయిన పోస్టుమార్టం: 36, మృతులకుటుంబాలకు రూ.1,00,000చొప్పున మంజూరుచేసిన కుటుంబాల సంఖ్య 18, గాయపడినవారికి రూ.50,000 చొప్పున మంజూరైనవారు 34 అని అన్నారు. తాత్కాలిక ఆర్థికసహాయం కింద 18 మృతుల కుటుంబాలకు రూ.1,00,000 చొప్పున, గాయపడిన 34మందికి రూ.50,000 చొప్పున చెల్లించిన తాత్కాలిక సహాయం, మిస్సింగ్ అయిన 10కార్మికుల కుటుంబాలకు రూ.10,000చొప్పున తాత్కాలికసహాయం అందించడం జరుగుతుందన్నారు. బాధిత కుటుంబాలు లేదా వారిబంధువులు సమాచారం కోసం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నంబర్ 08455276155ను సంప్రతించవచ్చు. ఈహెల్ప్‌డెస్క్‌ద్వారా వారి అవసరాలపై సత్వరం స్పందించడానికి సిబ్బంది కార్యాలయ పనివేళల్లో అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

**ప్రమాదస్థలిని పరిశీలించిన తెలంగాణరాష్ట్ర కాంగ్రెస్‌ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్..**

**ఆందోళనకు దిగిన బాధితులబంధువులను సముదాయించిన మంత్రి దామోదర రాజనర్సింహ..**

పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ పేలుడు సంఘటన వద్దకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ఉదయం చేరుకున్నారు. మంత్రి వెంట తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, జగ్గారెడ్డిలు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రమాదస్థలిని వారు పరిశీలించారు. అయితే అధికారులముందు బాధితుల బంధువులు ఆందోళనకు దిగారు. మంత్రి దామోదరతో బాధితులు వాగ్వాదానికి దిగారు. మూడు రోజులైనా తమ వారి ఆచూకీ చెప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చర్యలు చేపడతామంటూ బాధితులను మంత్రి దామోదర రాజనర్సింహ సముదాయించారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వచ్చాక మృతదేహాలను వాళ్ళ కుటుంబసభ్యులకు అప్పగిస్తామని అన్నారు. ప్రతిపక్షాలు దీన్నిరాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని స్పష్టం చేశారు. కంపెనీ యజమాని అందుబాటులోకి వచ్చారని, ఇప్పటికే కంపెనీపై కేసు నమోదు చేయించామన్నారు. మిగిలిన శిథిలాలు తొలగిస్తే మిగతా 11మంది ఆచూకీ లభించే అవకాశం ఉందని మంత్రి దామోదర్ వెల్లడించారు.

**క్షతగాత్రులను, వారికుటుంబసభ్యులను పరామర్శించిన మీనాక్షి నటరాజన్..**

ప్రణమ్ ఆస్పత్రిలో పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, వారి కుటుంబ సభ్యులను ఎఐసిసి తెలంగాణరాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షినటరాజన్, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీలు పరామర్శించారు. బాధితుల బంధువుల సమాచారాన్ని స్వయంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వీకరించారు. బాధితుల బంధువులకు భరోసాను కల్పించారు. అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున పూర్తి న్యాయం చేస్తామని వెల్లడించారు.

## గీతం స్నాతకోత్సవ ముఖ్యఅతిథిగా కిరణ్ కార్నిక్

**-సభాధ్యక్షత వహించనున్న గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్**

**పటాన్‌చెరు, జూలై 2, ప్రభాతవార్త:**
నాస్కామ్ పూర్వ అధ్యక్షుడు, భారతదేశ ఐటీ, అంతరిక్ష రంగాలలో ప్రముఖుడు కిరణ్‌కార్నిక్ ఈనెల 19న జరగనున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. హైదరాబాదు ప్రాంగణంలో నిర్వహించే ఈవేడుకకు గీతం అధ్యక్షుడు, విశాఖపట్నం పార్లమెంటు (లోక్‌సభ) సభ్యుడు ఎం.శ్రీభరత్ సభాధ్యక్షత వహించనున్నట్టు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. గీతం కులపతి డాక్టర్ వీరందర్‌సింగ్ చౌహాన్, ఉపకులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ కూడా ఈవేడుకలో పాల్గొంటారని తెలియజేశారు.

## బుద్ధుని బోధనలు నేటి తరానికి అవసరం

**-అలరించిన గౌతమ బుద్ధుని నాటక ప్రదర్శన**


జ్యోతి వెలిగించి నాటక ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, జులై 1, ప్రభాతవార్త:**
ప్రపంచానికి మానవత సుగంధాలు అందించిన తథాగత భగవాన్ బుద్ధుడి బోధనలు నేటి తరానికి ఎంతో అవసరమని వక్తలు పేర్కొన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని శెట్కార్ ఫంక్షన్ హాల్‌లో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో అభ్యుదన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శన నిర్వహించారు. నాటకంలో బుద్ధుడు బోధించిన శాంతి సందేశం ప్రజ్ఞ, శీల, కరుణ సామ్రాట్ అశోక చక్రవర్తి హింసను విడనాడి బైద్దాన్ని స్వీకరించి విశ్వ ఆప్తంగా చేసిన విధానం, 2500 సంవత్సరాల తర్వాత విశ్వ జ్ఞాని సంబడ వర్గాల హక్కుల ప్రదాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బౌద్ధ ధర్మానికి పునర్జీవనం పోసిన విధానాన్ని అభ్యుదయ ఆర్ట్స్ సంగీతంతో నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో అభ్యుదయ కళాకారుల చైర్మన్ కేకే రాజు, కమర్షియల్ ట్యాక్స్ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ బి శ్యామ్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు రవీందర్ బైద్ద యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు నరేష్‌గౌడ్, నాయకులు ఎల్ జనార్ధన్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కర్ణం రవికుమార్, జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు సురేష్,బుద్ధిష్ట సొసైటీ నాయకులు సుభాష్, నర్సింలు, అశోక్, రాజు, బంద్యప్ప, సువర్ణ, నియోజకవర్గంలోని బైద్దిస్టు అభిమాను, అంబేద్కర్ దళిత సంఘాలు, యువజన సంఘాల నాయకులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ పంచాయతీ అవార్డులపై అవగాహన సదస్సు

**నర్సాపూర్, జూలై 2, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ అవార్డులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసదస్సులో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనగా గ్రామపంచాయతీ కార్యదర్శులకు టెక్నికల్ అసిస్టెంట్లకు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు జాతీయ పంచాయతీ అవార్డులకోసం ప్రశ్నావళిని వివరించారు. అనంతరం జాతీయ పంచాయతీ అవార్డులపై అధికారులు పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వైద్య శ్రీనివాస్, ఆర్ ఐ ఫైజల్, ఏటీఎం గౌరీశంకర్, ఏపీవో అంజిరెడ్డి, ఏయ్ ముజీబ్ పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహబంధు ఆధ్వర్యంలో కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభం

**నర్సాపూర్, జూలై 2, ప్రభాతవార్త:**
లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు 2025...26 నూతన సంవత్సరం ప్రారంభం సందర్బంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధం ఆధ్వర్యంలో మంగళవారం పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి తారాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ మేరకు లయన్స్ క్లబ్ అధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మొమెంటోలు బహుమతులు అందజేయడం జరిగింది. అదేవిధంగా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే ను పురస్కరించుకొని నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని డాక్టర్లను శాలువాలతో సన్మానించి ఆసుపత్రిలోని రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు, అదేవిధంగా లైన్స్ క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు ఆధ్వర్యంలో కుట్టుమిషన్ కేంద్రాన్ని 18మంది నూతన విద్యార్థులచే ప్రారంభించారు. అలాగే ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఉన్న వృద్ధులకి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ టి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**-కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి**


భూమిపూజచేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి

**నర్సాపూర్, జూలై 2, ప్రభాతవార్త:**
అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు.బుధవారం ఇబ్రాహీంబాద్ గ్రామంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి సమక్షంలో జిల్లా మాజీ జనరల్ సెక్రెటరీ మరాఠీ రామాగౌడ్ మన్నె భీమ్ పెద్దాపురం రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఇవదిరమ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు మరాఠి యాదగౌడ్, ఉపాధ్యక్షులు హరిజనరాజు దాడిగి అర్జున్ దాడిగి నరేష్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్రాల మల్లేశం మాజీ ఎంపీటీసీ మేఘమాల కిషన్ ఉదయ్ కుమార్ అశోక్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ యాదవ్ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ గ్రామస్తులు తదితరు పాల్గొన్నారు.

## హైద్రాబాద్లో జరిగే కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**-టిపిసిసి ప్రధాన కార్యదర్శి దయాకర్**


సమావేశ:ంలో మాట్లాడుతున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి దయాకర్

**నర్సాపూర్, జూలై 2, ప్రభాతవార్త:**
ఈనెల 4న హైదరాబాద్‌లోని ఎల్బి స్టేడియంలో గ్రామస్థాయి నేతలతో నిర్వహించే కాంగ్రెస్ భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి దయాకర్ పిలుపునిచ్చారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి పాల్గొనగా ముఖ్య అతిథిగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సోమన్న గారి లక్ష్మీ ్మ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు అన్ని మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు మహిళా కాంగ్రెస్ నాయకురాలు యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలోనే పేదింటి కల సాకారం

**-గజ్వేల్ ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి**


భూమిపూజ చేస్తున్న ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, జులై 2 (ప్రభాతవార్త):**
కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పేదోళ్ల ఇంటి నిర్మాణ కల సాకారం అవుతుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు వెంకట్రామారెడ్డి, శ్రావణ్, పద్మ, నర్సింలు, భానుచందర్, తిరుపతిరెడ్డి, మునీర్, కొండయ్య, విద్యాధర్, అమరేందర్‌రెడ్డి, బాలరాజు, సాయిబాబా, సుదర్శన్, నర్సింలు, సత్యనారాయణ, సత్తయ్య, దుర్గయ్య, కనకయ్య, శివకుమార్, శివారెడ్డి, శ్రీనివాస్, బాలకిషన్, సురేష్ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో నీటి సమస్యను పరిష్కరించాలి

**-కమిషనర్‌కు వినతిపత్రం అందించిన బిజెపి నాయకులు**

**గజ్వేల్, జులై 2 (ప్రభాతవార్త):**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో రోజురోజుకు త్రాగునీటి సమస్య ఎక్కువ అవుతుందని వెంటనే సమస్యను పరిష్కరించాలని బుధవారం భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రోజుకు రెండుమూడు గంటలు నీళ్లు వచ్చేవని, ప్రస్తుతం అరగంట వస్తే ఎక్కువ అయిపోతుందని, నీళ్లు ఎక్కువ వచ్చేలా చూడాలని, లేకపోతే మహిళలు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. నీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. అనంతరం ఇటీవల నూతనంగా బాధ్యతలు తీసుకున్న కమిషనర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకట్‌రెడ్డి, గజ్వేల్ బిజెపి నాయకులు నాగు ముదిరాజ్, మాద్గురి నర్సింహ, రాజేశ్వర్‌చారి, పంజాల రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

**-రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి**

**గజ్వేల్ టౌన్, జులై 2 (ప్రభాతవార్త):**
సిఎం రేవంత్‌రెడ్డి మాటలు బిసివర్గాలు నమ్మే పరిస్థితి లేదని, బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి వద్దకు బిసి రిజర్వేషన్ల విషయంలో అఖిలపక్ష కమిటీని తీసుకుపోతామని చెప్పి ఎందుకు తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో రైలు రోకో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని బిసి వర్గాలు రైలు రోకో కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

## కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

**జగదేవ్‌పూర్, జులై 2 (ప్రభాతవార్త):**
మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గతనెల 28, 29 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ స్లీవరాజు తెలిపారు. 46 కేజీల పాయింట్ ఫైటింగ్ విభాగంలో ఆర్.చందన (8వ తరగతి) సిల్వర్ మెడల్, 32 కేజీల విభాగంలో బి.జోష్ణ (8వ తరగతి) సిల్వర్ మెడల్, 50 కేజీల మ్యూజికల్ ఫామ్ విభాగంలో మధులత (ఇంటర్మీడియెట్ సెకండియర్) గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో మరింత సత్తా చాటి పాఠశాలకు మంచి పేరు తేవాలని అన్నారు. అనంతరం మెడల్స్ సాధించిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ అనంతరాములుచారిని ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

## కాళిదాసు నాయక్ విగ్రహావిష్కరణ

మండలంలోని మోత్కులపల్లి పెద్దతండాకుచెందిన గుగులోతు కాళిదాసు కొద్దిరోజులక్రితం మరణించగా బుధవారం ఆయన విగ్రహావిష్కరణ షెడ్యూల్ కులాల సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రాములునాయక్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, ఉద్యోగులు, మేధావులు తదితరులతోకలిసి ప్రారంభించారు.

## పండరిపురంకు అలాంది నుంచి పాదయాత్ర

**సిర్గాపూర్, జులై 2, ప్రభాతవార్త:**
మహారాష్ట్రలోని పండరిపురంకు అలాంది నుంచి భక్తులు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తొలి ఏకాదశి రోజున రుక్మిణి సమేత పండరినాథుడిని దర్శించుకునేందుకు భగవత్ నామస్మరణతో శ్రీ సంత్ జ్ఞానేశ్వర్ మహారాజ్, శ్రీ జగద్గురు తుకారం మహారాజ్ పాదుకలతో భక్తులు పాదయాత్రగా బయలెక్కారు. నియోజకవర్గ కేంద్రమైన నారాయణ ఖేడ్ ప్రాంతం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో చేరి విఠల నామస్మరణతో పాద యాత్ర నిర్వహించారు. కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ మాట్లాడుతూ దైవ నామస్మరణ తోనే మనిషికి ఆనందం దక్కుతుందన్నారు. ప్రతి నిత్యం ప్రతి ఒక్కరు దైవనామ స్మరణ చేయాలని వివరించారు.


**BEFORE THE HONORABLE ADDITIONAL INDUSTRIAL TRIBUNAL CUM LABOUR COURT AT: HYDERABAD**
**M.P.No 1 OF 2025**
**IN**
**I.D.No.15 OF 2023**

**BETWEEN:**
The Management of M/s. MRF Ltd, Medak Plant, P.B.No.2, Sadashivapet, Sanga Reddy District.
**... Applicant**

**AND**
Mr. Mohd Azam S/o: Babu sha, Aged about 43 years, Permanent Address: R/o: 3-37, Village Peeddapur, Sangareddy District-502306. Present Address: H.No:6-1-44, Upper Bazar, Sangareddy-502001
**...Opposite Party**

To,
Mr. Mohd Azam
Take Notice that the above named Applicant filed application under Section 33(2)(b) of the Industrial Disputes Act, 1947, seeking approval of the action taken against you. Therefore, you are hereby directed to appear before the above mentioned court in person or by a pleader duly authorized on 16.7.2025 at 10.30 a.m. Otherwise the matter will be heard and determined exparte.

**(By Order of the Court)**
**M.Radha Krishna Murthy,**
**N.SeetaLaxmi**
**Advocates**
1-9-639, Street No.16,
Adikmet Road,
Vidyanagar,
Hyderabad-500 044.

## విద్యార్థిదశ చాలా కీలకం

**-హుస్నాబాద్ ఏసిపి సదానందం**




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసిపి సదానందం

**కోహెడ, జులై 2, ప్రభాతవార్త:**
విద్యార్థిదశ చాలా కీలకమని ఈసమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారు ఉన్నతంగా ఎదుగుతారని హుస్నాబాద్ ఏసిపి సదానందం అన్నారు. మండల పరిధిలోని నాగసముద్రాల తెలంగాణ మోడల్ స్కూల్, కాలేజీలో బుధవారం విద్యార్థులకు మహిళల రక్షణచట్టాలు, సైబర్‌నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, సిసి కెమెరాలు, నూతన చట్టాలు తదితర అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రేమ పెళ్లి అంటూ అకర్షణకులోనై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచలనకు తావివ్వకుండా ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలన్నారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకోవాలన్నారు. నూతన చట్టాలు మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. రోడ్డుపై వెళ్లే సమయంలో ఎవరైనా వేధించినా, అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట షీటీమ్ నెంబరు 8712667434కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి. అభిలాష్, ప్రిన్సిపాల్ నరసింహులు, వైస్‌ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఆధ్యాపకులు, షీటీమ్ బృందం సదయ్య, పోలీసు సిబ్బంది స్వప్న, ప్రశాంతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోశయ్య జయంతిపై ప్రభుత్వ నిర్ణయం పట్ల నాయకుల హర్షం

**సిద్దిపేట అర్బన్, జులై 2, ప్రభాతవార్త:**
ఉమ్మడిరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడంపట్ల రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు అయిత రత్నాకర్‌లు హర్షం వ్యక్తంచేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొణిజేటి రోశయ్య 16సార్లు ఆర్థికమంత్రిగా బడ్జెట్ ప్రవేశపెట్టి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఏపి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా పనిచేసి పార్టీలకు అతీతంగా దేశనాయకుల మన్ననలు పొందారని తెలిపారు. మహోన్నత వ్యక్తి రోశయ్య జయంతిని ఆధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంతోపాటు ఆయన విగ్రహాన్ని లక్డీకాపూల్ వద్ద ఈనెల 4న సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించుకోవడం పట్ల వారు సంతోషం వ్యక్తంచేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు తణుకు అంజనేయులు, జిల్లా మాజీ అధ్యక్షులు కాసం నవీన్‌కుమార్, గంప కృష్ణమూర్తి, రవీందర్, తడక లింగమూర్తి, మంకాల నాగేష్, రావికంటి చంద్రశేఖర్, పబ్బ మాధవి పాల్గొన్నారు.

## కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి

**-ప్రధానికి లక్ష పోస్ట్ కార్డ్స్ పంపిస్తాం**



కొమురవెల్లికి చేరుకున్న పోస్ట్‌కార్డు ఉద్యమయాత్ర

**కొమురవెల్లి, జులై 2, ప్రభాతవార్త:**
ఆర్బీఐ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. పరశురామ్ చేపట్టిన దేశ వ్యాప్త లక్ష పోస్ట్ కార్డ్ ఉద్యమ యాత్ర బుధవారం కొమురవెల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 500 మందితో పోస్ట్ కార్డ్స్ పోస్ట్ చేయడం జరిగిందన్నారు. కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలన్నారు. జూన్ 23 నుంచి 2026 జనవరి వరకు దేశ ప్రధాని నరేంద్రమోడీకి లక్ష మందితో పోస్ట్ కార్డ్ అందించే ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి, కవి, గాయకులు పిన్నింటి రత్నం, బిఆర్ఎస్‌వి రాష్ట్ర నాయకులు ఏర్పుల మహేష్, మాజీ ఎంపిటిసి లింగంపల్లి కనకరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు గడిపే బాలనర్సయ్య, దర్శనం వెంటకయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకెళ్లాలి

**-టిపిసిసి ప్రధాన కార్యదర్శి అసదుద్దీన్**




సమావేశంలో మాట్లాడుతున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి అసదుద్దీన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
టిపిసిసి ఆధ్వర్యంలో ఈనెల 4న హైదారాబాద్ ఎల్‌బి స్టేడియంలో నిర్వహించే ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే సభకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి పార్టీశ్రేణులు, ప్రజలు పెద్దయెత్తున తరలిరావాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి అసదుద్దీన్ పిలుపునిచ్చారు. సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమపథకాలు, అభివృద్ధిపనులను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో పార్టీనాయకులు పూజల గోపికృష్ణ, సాకి అనంద్, యాదగిరి, లక్ష్మీ, రియాజుద్దీన్, కలీం, వాహబ్, వహీద్‌ఖాన్, హర్షద్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## లోకల్ పాస్ కోసం ఆధార్‌కార్డు అందచేయాలి

**చౌటకూరు, జులై 2, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తాడ్దానిపల్లి గ్రామ శివారులోని సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై గల టోల్ ప్లాజాలో లోకల్ పాస్ కొరకు ఆధార్‌కార్డు ఆర్‌సి పత్రాలను అందచేయాలని టోల్ ప్లాజా మేనేజర్ డ్యానీ తెలిపారు. జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వసూలుకు సంబంధించి కాంట్రాక్టర్ మారినందున 20 కిలోమీటర్ల పరిధిలో సొంత కార్లు, జీపులు ఉన్నవారు లోకల్ పాస్ కొరకు ఆధార్‌కార్డు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను విధిగా అందచేయాలని సూచించారు. లోకల్‌పాస్‌పొందిన వాహనదారులు ప్రతి నెల 350 రూపాయలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఆదేశాలమేరకు లోకల్‌పాస్‌లను అంద చేస్తామన్నారు ఆధార్‌కార్డు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు ఒకసారి అందచేస్తే ఏడాదివరకు ఆటోమేటిక్‌గా రీచార్జి చేసుకునేందుకు వెసలుబాటు ఉంటుందని మేనేజర్ డ్యానీ తెలిపారు.

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల వర్తింపు

**-కార్యకర్తల శ్రమ, కష్టాన్ని గుర్తుంచుకుంటాం**
**-డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి**



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**వర్గల్, జులై 2, ప్రభాతవార్త:**
పార్టీలకు అతీతంగా ప్రజాసంక్షేమపథకాలు వర్తింపజేస్తుండగా, అర్హులైన ప్రతిపేదవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్, తునికిఖాల్సా, మీనాజిపేట, జబ్బాపూర్, శేరిపల్లి గ్రామాల్లో లబ్దిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరుకాగా, ఇప్పటికే అర్హులైన 2938మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేసినట్లు తెలిపారు. మరిన్ని ఇళ్ల మంజూరుకు సిఎం సానుకూలంగా ఉండగా, ప్రజాపాలనలో పేదలు సంతోషంగా ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంచేశారు. రైతులసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్ల రైతుభరోసా నిధులను రైతులఖాతాల్లో జమచేసిన ఘనత సిఎంకి దక్కుతుందన్నారు. పేదల ఆరోగ్యానికి పెద్దపీటవేస్తూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆరునెలల్లో ఇంటి నిర్మాణాలు పూర్తిచేసి పండగ వాతావరణంలో గృహ ప్రవేశాలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హౌజింగ్ డిఈ శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచారకమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, వంటిమామిడి ఎఎంసి చైర్మన్, వైస్ చైర్మన్‌లు విజయమోహన్, ప్రభాకర్‌గుప్త, మాజీ జెడ్‌పిటిసి ప్రభుదాస్‌గౌడ్, మాజీ ఎంపిపి విద్యాకుమార్, మండలపార్టీ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సాయిగౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు గోపాల్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, ప్రవీణ్‌గౌడ్, రామచంద్రం, భూమయ్య, శంబయ్య, కుమార్, రవి, కొండల్‌రెడ్డి, కొండల్ పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**
ఇందిరమ్మ పథకం ద్వారా ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇందిరమ్మ పథకం ద్వారా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌పరిధిలో 92ఇళ్లు మంజూరు అయ్యాయని, అర్హులైన లబ్దిదారులు దరఖాస్తు చేసుకుంటే మరిన్ని ఇళ్లు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాయకులు సుఖేందర్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, జాంగీర్, ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వానొస్తే మండల కేంద్రంలో అంధకారం

**-స్థానికంగా ఉండని హెల్పర్, లైన్‌మెన్లు**

**చౌటకూరు, జులై 2, ప్రభాతవార్త:**
ఆగ్రామంలో ఈదురు గాలివీచినా, వానొచ్చినా అంధకారంగా మారడం సర్వసాధారణంగా మారిపోయింది. ఆగ్రామం మండలంలోని మారుమూల ప్రాంతమై ఉంటుందని ప్రజలు పప్పులోకాలేయకండి. వానొస్తే అంధకారంగా మారేది మండల కేంద్రమైన చౌటకూరు అంటే అయ్యో అనక తప్పదు. ఇందుకు సంబంధించి పూర్తివివరాల్లోకి వెళితే.. మండలకేంద్రమైన చౌటకూరులో చిన్నపాటి ఈదురుగాలులువీచినా, చినుకులుపడినా వెంటనే విద్యుత్ అధికారులు గ్రామానికి విద్యుత్ సరఫరాను క్షణాల్లో నిలిపేస్తూ ఉంటారు. అనునిత్యం గ్రామంలో విద్యుత్ సరఫరా ఆగిపోవడం నిత్యకృత్యంగా మారిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సాయంత్రం అయ్యిందంటే విద్యుత్ సరఫరా ఎప్పుడు ఆగిపోతుందో తెలియని దుస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మంగళవారం రాత్రి కురిసిన చిన్నపాటివర్షానికి గ్రామంలోని కింది బజార్‌లో కండక్టర్ వైర్ తెగిపోవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. గ్రామంలో దోమలు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోయిందని విచారం వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ సరఫరాను పర్యవేక్షించాల్సిన హెల్పర్, లైన్‌మెన్‌లు స్థానికంగా ఉండకపోవడంతో సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు పడుతున్నపాట్లు చెప్పనలవిగా ఉన్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి హెల్పర్, లైన్‌మెన్‌లు స్థానికంగా ఉండేలాచేస్తూ విద్యుత్ సరఫరా ఆగిపోతే వెంటనే సరఫరా అయ్యేలా చొరవతీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్‌చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమిపూజ

**మర్కుక్, జులై 2, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన నిర్మించేందుకు కృషి చేస్తుందని అంగడికిష్టాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అంగడికిష్టాపూర్‌లో బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం గ్రామపంచాయతీ కార్యదర్శి సిద్ధేశ్వర్, మాజీ ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్దిదారులకు విడతలవారీగా బిల్లులువస్తాయని, ఇంటినిర్మాణం త్వరితగతిన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిద్ధిగణపతి దేవాలయంలో హుండీ లెక్కింపు

**-హుండీ ఆదాయం మొత్తం రూ.29,37,743**
**-ఆలయ ఈవో లావణ్య**



ఆలయ హుండీ లెక్కిస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు, జులై 2, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ సమీపంలోని గణేష్‌గడ్డ ప్రసిద్ద శ్రీ సిద్ధి గణపతి దేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. 105 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.28,17,149(ఇరవై ఎనిమిది లక్షల పదిహేడు వేల ఒక్క వంద నలభై తొమ్మిది రూపాయలు), అన్నదానం హుండి ఆదాయం రూ.1,20,594 (ఒకలక్ష ఇరవైవేల ఐదువందల తొంబై నాలుగు రూపాయలు), మొత్తం హుండీ ఆదాయం రూ.29,37,743 వచ్చిందని ఆలయ ఈవో లావణ్య తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు సమక్షంలో హుండీ లెక్కింపు కొనసాగింది. ఈ యొక్క హుండీ ఆదాయాన్ని దేవాలయ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. భక్తుల అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ ప్రాంతాన్ని తిరిగి కరీంనగర్‌లో కలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**కోహెడ, జులై 2, ప్రభాతవార్త:**
కేంద్రానికి భౌగోళికసరిహద్దులు పంపించకముందే కోహెడ-హుస్నాబాద్-అక్కన్నపేట మండలాలను తిరిగి కరీంనగర్‌లో జిల్లాలో కలపకపోతే హుస్నాబాద్ ప్రాంతం శాశ్వతంగా కరీంనగర్‌కు దూరం అయ్యే అవకాశాలు నెలకొన్నాయని బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మం వెంకటేశం అన్నారు. కోహెడ మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు జాలిగం రమేష్, పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే హుస్నాబాద్ ప్రాంతాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలిపే బాధ్యత నాది అని ఎన్నికల్లో ఇచ్చిన హామీని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. ఏ రకంగా చూసిన హుస్నాబాద్ ప్రాంతానికి కరీంనగర్ జిల్లానే అనువైన జిల్లా అన్నారు. హుస్నాబాద్ ప్రాంతాన్ని తిరిగి కరీంనగర్‌లో కలపకపోతే బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్దమవుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సయ్యగౌడ్, మ్యాకాల చంద్రశేఖర్‌రెడ్డి, గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్ యాదవ్, బొమ్మగాని శివకుమార్‌గౌడ్, రామంచ రామచంద్రారెడ్డి, పెర్యాల సాగర్‌రావు, రాజురెడ్డి, సంజీవరెడ్డి, అనిల్, సాయికిశోర్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు నాణ్యమైన కూరగాయలు పండించాలి

**-వ్యవసాయ సహాయ సంచాలకులు అనిల్**



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

**ములుగు, జులై 2, ప్రభాతవార్త:**
కూరగాయ పంటల సాగులో రైతులు ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో పురుగుమందుల వాడకం వల్ల కలుషితమైన కూరగాయల ఉత్పత్తి జరుగుతుందని, రైతులందరూ ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన కూరగాయలు పండించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అనిల్ కోరారు. బుధవారం ములుగు మండలంలోని తునికిబొల్లారం గ్రామ రైతు వేదికలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ జీడిమెట్ల ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా అందించే బిందు తుంపర సేద్య పరికరాలు, కూరగాయల నారు, రక్షిత సేద్యం పందిర్లు ఫామ్ పాండ్, పండ్ల తోటలు మొదలైన రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేట ఫిమ్ ఆగ్రోనామిస్ట్ సుబ్బారావు మాట్లాడుతూ ఫెర్టిగేషన్ నిర్వహణ మరియు బిందు సేద్య పరికరాలను వాడే పద్ధతులను వివరించారు. ఉద్యాన అధికారి సౌమ్య మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా అమలుపరుస్తున్న సబ్సిడీలను రైతులకు వివరించడంతో పాటు ఆయిల్‌ఫామ్ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యాన విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.మల్లేష్, కోరమండల్ సీనియర్ మేనేజర్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి ప్రగతి, జీడిమెట్ల హార్టికల్చర్ అధికారి జలంధర్, వ్యవసాయ విస్తరణాధికారి అనుజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభార్జన

**-ఎకరాకు రెండు లక్షల వరకు ఆదాయం**
**-జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్**

**చిన్నశంకరంపేట, జులై 2, ప్రభాతవార్త:**
ఆయిల్‌పామ్ సాగుతో రైతులు తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేటలో వార్తతో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా మార్చి 31 నాటికి ప్రభుత్వం 900 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఈ వార్షిక సంవత్సరం 2500 ఎకరాలకు పెంచిందన్నారు. ఆయిల్‌పామ్ సాగుచేయాలనుకున్న రైతులు మీ సేవ ద్వారా దరఖాస్తులను అందించాలన్నారు. రైతులకు అవగాహన కల్పించడంతో క్రమేణ సాగు చేసేవారు పెరిగారన్నారు. నేటి వరకు 13,625 దరఖాస్తులు అందాయన్నారు. రాయితీపై అందించే డ్రిప్ (నీటి సరఫరా పైపులకు) 771 మంది డబ్బులు ప్రభుత్వ ఖాతాలో జమ చేశారని, అందులో 142 మంది రైతులకు పరికరాలను అందించామని, అక్కడ పనులు కూడా ప్రారంభమైనట్లు వివరించారు. ఇతర పంటల కన్నా పామాయిల్ సాగు చాలాసులువుగా పండించవచ్చన్నారు. పంటనాటిన నుండి మూడవ సంవత్సరానికి పంట చేతికి వస్తుందని తెలిపారు. మొక్కలను జాగ్రత్తగాకాపాడుకుంటే 35 సంవత్సరాల వరకు దానికి ఖాతా వస్తూనే ఉంటుందన్నారు. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తుందని, టన్నుకు ప్రభుత్వంనిర్ణయించిన ధర రూ. 19200 అని, తెలంగాణ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా పంటను ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలో లీవ్ ఫామ్ ఆయిల్ రిసోర్స్ పరిశ్రమ వారు రైతుల వద్ద నుండి పొలాలను లీజుకు తీసుకొని సుమారు 53 ఎకరాల్లో ఆయిల్ పాం పంటను సాగు చేస్తున్నట్లు వివరించారు.

**కొనుగోలు కేంద్రం ప్రారంభం..**
త్వరలో నియోజకవర్గంలో ఆయిల్ పాం పంట కొనుగోలుకేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. రైతుల వద్ద నుండి పంటను సేకరించి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తాము. జిల్లాలో కేంద్రం ఏర్పాటుకు ఆలస్యమైతే పంటను సిద్దిపేట జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకి తరలిస్తాము. ఆయిల్ ఫామ్ సాగుకు ముందు వచ్చే రైతుకు ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీలకు 80 శాతం, బీసీలకు 50 శాతం రాయితీని అందిస్తుంది. రైతులు ముందుకు వచ్చి ఆయిల్ ఫామ్ సాగు చేయాలి. ఇతర పంటల కన్నా ఎక్కువ లాభం ఆయిల్ ఫామ్ సాగులో పొందవచ్చు. ఎకరాకు రెండు లక్షల కంటే ఎక్కువ పొందవచ్చు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

## రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజాపాలన

**-కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తిరుపతిరెడ్డి**

**న్యాల్‌కల్, జులై 2, ప్రభాతవార్త:**
జాతీయ నూనెగింజల పథకంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలోని రైతువేదికలో నారింజ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ సమక్షంలో రైతులకు సోయాబీన్ విత్తనాలను, జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగా వ్యవసాయశాఖ ద్వారా ఎల్ఆర్‌జి-52 రకం కంది విత్తనాల మినికిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డిలు మాట్లాడుతూ రైతుసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, రైతులకు పంట పెట్టుబడి సహాయం కింద ఎకరానికి 6వేల రూపాయల చొప్పున ప్రభుత్వం రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసినట్లు గుర్తు చేశారు. రైతులకు సోయా, కంది విత్తనాలు పంపిణీ చేయడాన్ని ఉదహరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మెటల్‌కుంట మాజీసర్పంచ్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్, హద్నూర్ సొసైటీ చైర్మన్లు మడపతి సిద్దలింగయ్యస్వామి, ఎక్కెల్లి జగన్నాథ్‌రెడ్డి, ఎడిఎ భిక్షపతి, మండల వ్యవసాయాధికారి అవినాష్‌వర్మ ఎఫ్‌పిఓ సిఈఓ శ్రీకాంత్‌రెడ్డి, ఎఈఓలు సాయిలు, సాయికిరణ్‌రెడ్డి, మాధవి, సన్నిధిరెడ్డి, రమేష్, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన పాడి గేదె దృశ్యం

**చౌటకూరు, జులై 2, ప్రభాతవార్త:**
కరెంట్ షాక్‌తో పాడిగేదె మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన చౌటకూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొజ్జ రాజు తన తన పాడిగేదెను మేత మేపేందుకు గ్రామ శివారులోని ఈఎంపీఈ డిస్టిల్లరీపరిశ్రమ ప్రాంతం వైపుకు తీసుకుపోయాడు. రైతు రవీందర్‌రెడ్డికి చెందిన వ్యవసాయభూమిలో పాడిగేదె మేత మేస్తుండగా పొలంలో పాతిన విద్యుత్ స్తంభానికి అమర్చిన సపోర్టు వైరుకు తాకడంతో గేదె షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడిందన్నారు. ఇటీవల రూ. 1లక్ష గేదెను కొనుగోలు చేసినట్లు కొజ్జ రాజు పేర్కొన్నాడు. రవీందర్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలోని బోరు మోటారు పాడవడంతో ఈవిద్యుత్ తీగలను తొలగించి సర్వీస్ వైర్‌కు, సపోర్టు వైర్లకు చుట్టడంతోనే విద్యుత్ సరఫరా అయి పాడిగేదె మృత్యువాతపడిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ఆర్థికంగా ఇబ్బందులకు గురైన కొజ్జ రాజును పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు, గ్రామ మాజీ సర్పంచ్ కొల్కూరి వీరమణి మొగులయ్య కోరారు.

## గడ్డిమందు పిచికారితో పంట నాశనం

**-ఆవేదన చెందుతున్న రైతు చంద్రరెడ్డి**

**కంగ్టి, జులై 2, ప్రభాతవార్త:**
తన పొలంచుట్టూ పెరిగిన గడ్డి, కలుపు నివారణకు వాడిన గడ్డి మందు పక్క పొలంలోని రైతుకు పరేషాన్ చేసింది. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా తనపొలం చుట్టూ పెరిగిన గడ్డిని నివారించేందుకు వినియోగించిన 24డి రకం గడ్డిమందు గాలి ద్వారా పక్క పొలంలో సాగవుతున్న పత్తి పంటపై పడటంతో పంట ఎదుగుదల ఆగిపోయింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకివెళితే, మండల కేంద్రమైన కంగ్టికి చెందిన రైతు చంద్రరెడ్డి తనకు గల 2ఎకరాల వ్యవసాయ భూమిలో పత్తిపంటను సాగు చేసుకుంటున్నాడు. తన పొలానికి పక్కనే ఉన్న మరో రైతు తనపొలం చుట్టూ పెరిగిన గడ్డిని నివారించేందుకు 24డి రకం గడ్డిమందును పిచికారి చేసుకోగా గాలికి పిచికారి చేసిన మందు చంద్రారెడ్డి సాగు చేసుకుంటున్న పత్తిపంటపై పడటంతో పంట ఆకులు ముడుచుకుపోయి వంకరటింకరగా మారి ఎదుగుదల ఆగిపోయింది. పంటను సాగుచేసుకుని అప్పు తీర్చుకోవాలని గంపెడాశతో 2ఎకరాల్లో పత్తిపంటను సాగు చేసుకున్నానని, పక్క పొలంలో వినియోగించిన గడ్డిమందుతో తనపంట పూర్తిగా నాశనం అయిందని, తనకు నష్టపరిహారం ఎవరు చెల్లిస్తారని రైతు చంద్రారెడ్డి మనోవేదన చెందుతున్నాడు.

## విద్యార్థులే అధికంగా సైబర్ నేరాలకు గురవుతున్నారు

**-విద్యార్థులకు జాగ్రత్తలు చెప్పిన ఎస్ఐ శంకర్**



సైబర్ నేరగాళ్లపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**అల్లాదుర్గం, జులై 2, ప్రభాతవార్త:**
సైబర్ నేరగాళ్ల వలలో విద్యార్థులే అధికంగా మోసపోతున్నారని ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, నేరగాళ్లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులను ఆన్‌లైన్ గేమ్‌లో ఆశచూపి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేస్తారని, అపరిచితులకు ఓటిపిలు చెప్పవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురయితే స్పందించాల్సిన తీరుపై విద్యార్థులకు వివరించారు. సైబర్‌నేరానికి గురైతే వెంటనే పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయాలని, ఎఎస్ఐ గాలయ్య మాట్లాడుతూ అమ్మాయిలు, మహిళలు తమ సోషల్ మీడియా ఖాతాలో ఫోటోలను షేర్‌చేస్తే నేరగాళ్లు ఫోటోలను మార్ఫింగ్ చేసి వేధింపులకు దిగుతారని, బ్లాక్‌మెయిల్ చేస్తారని గుర్తుచేశారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని వివరించారు.

## అగ్నిమాపక కేంద్రం స్థలాన్ని శుభ్రం చేయండి

**-మున్సిపల్ కమీషనర్‌కి వినతిపత్రం**



మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు, జులై 2, ప్రభాతవార్త:**
బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో కొన్ని సంవత్సరాల క్రితం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది.ఆస్థలంలో అధికారులు అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చేపట్టలేదు. బుధవారం బాలాజీనగర్‌కి చెందిన కొంత మంది యువత గుండ్ల భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో బొల్లారం మున్సిపల్ కమిషనర్ బి.కిషన్‌ని మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం బాలాజీనగర్‌లో నిరుపయోగంగా ఉన్న అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుచేసిన స్థలాన్ని శుభ్రపరిచి దానిని యువతకు ఆటస్థలంగా వాడుకునేందుకు అవకాశం కల్పించాలంటూ వినతిపత్రం అందచేశారు. అంతకుముందు బాలాజీనగర్ యువకులు కమిషనర్‌ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్.ఓ నరసింహులు, హరీష్, అర్జున్, ఆనంద్, ఆదర్శ్, యువరాజ్, విజయ్, ప్రిన్స్, కుందన్, సతీష్ తదితరులు ఉన్నారు.